www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 24 సెప్టెంబర్ 2024
5
అన్నమయ్య

భారీ వర్షంతో రైతులకు ఊరట

వర్షంతో చెక్ డ్యాంలోకి చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి-కలికిరి : మండలంలో భారీ వర్షం కురవడంతో వ్యవసాయ రైతులకు ఊరట లభించింది. సంవత్సరం కాలంగా సకాలంలో వర్షాలు కురవక ప్రజలతోపాటు, వ్యవసాయ రైతులు సైతం ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. ఆదివారం రాత్రి 10 గంటల నుంచి తెల్లవారు 5 గంటల వరకు కురిసిన భారీ వర్షానికి వంకలు, చిన్న చిన్న చెరువులు సైతం జలకళను సంతరించుకున్నాయి. రెండు, మూడు నెలలుగా వర్షాభావంతో భూగర్భజలాలు సైతం ఇంకిపోయి వ్యవసాయ బోర్లు కూడా ఎండిపోయాయి. రైతులు వ్యవసాయ పనులు మానేసి కూలీ పనులు వెళ్లాల్సి వచ్చింది. వేరుశనగ రైతులు కూడా పంట పూర్తిగా ఎండిపోవడంతో ఎలా ఉత్పత్తి చేసుకోవాలో తెలియక ట్యాంకర్ల ద్వారా నీళ్లు పిసికారి చేసి ఒక్కిడి చేసుకోవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టే సమయంలో ఈ భారీ వర్షం మండలంలోని రైతాంగానికి భారీ ఊరట కలగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి

- బ్లాక్ డే నిరసనలో కార్మిక, రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద బ్లాక్ డే సందర్భంగా ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలియజేశారు. వ్యవసాయ రంగంలో మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతు పొలంలో రైతే కూలిగాని చేసే పరిస్థితి తీసుకొచ్చారని చెప్పారు. కార్పొరేట్ వ్యవసాయానికి రెడ్ కార్పెట్ పరుస్తు తద్వారా అధిక ధరలతో ఆహార భద్రత సమస్యకు కారణమవుతున్నారని విమర్శించారు. మరోవైపు ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రయివేటీకరణ చేస్తూ వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వం మంగళం పాడుతోందని వాపోయారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలన్నారు. మత తత్వ కార్పొరేటీకరణ వల్ల దేశంలోని అసమానతలు పెరిగి నిత్యం ఘర్షణలతో సాంఘిక భద్రత ఉండదన్నారు. మహిళల మీద నిత్యం దాడుల నివారణకు పటిష్ట చర్యలు ప్రభుత్వాలు తీసుకోవాలని అన్నారు. నేడు జరుగుతున్న బ్లాక్ డే కార్యక్రమం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెంప పెట్టు లాగా భావించాలని ప్రజానీకాన్ని కోరారు. కార్మికులు, రైతులు, ప్రజల మీద నిత్యం భారాలు వేస్తూ కార్పొరేట్ సంక్షేమం కోసం పనిచేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలు రద్దు చేసేంతవరకు నిరవధిక

అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద నిరసన తెలుపుతున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

పోరాటాలు వివిధ రూపాలలో చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు నాయకులు ఈశ్వరయ్య, జనకయ్య, కార్మిక నాయకులు మాధవయ్య, ఆంజనేయులు, రమేష్, వాసు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేక చట్టాలు చేసినందుకు సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రైల్వేకోడూరులో సోమవారం టోల్‌గేట్ గాంధీ విగ్రహం వద్ద బ్లాక్ డే నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 39 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కార్మిక వ్యతిరేక చట్టాలను 2019 సంవత్సరంలో పార్లమెంట్‌లో ఆమోదించుకున్నారని పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా 8 గంటల పనిని 12 గంటలకు పెంచడం, కనీస వేతనాలు చట్టం, ఓవర్ టైం, పిఎఫ్, బోనస్, గ్రాడ్యుటీ, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో పనిచేస్తున్న కార్మిక వర్గానికి వ్యతిరేకంగా చట్టాలను నిర్వీర్యం చేసి పెట్టుబడుదారులకు అనుకూలంగా మార్చారని పేర్కొన్నారు. విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ ఆపాలని, కడప ఉక్కును ప్రారంభించాలని, విభజన చట్టం హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు లింగాల యానాదయ్య, సహాయ కార్యదర్శి నగిరిపాటి ఆనంద్, కోశాధికారి కర్రతోటి హరి నారాయణ, యుఇఇయు నాయకులు సి.వేణు, ఎం.సుబ్బరాయుడు, అంకయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మద్దెల ప్రసాద్, విఆర్ఎల సంఘం మండల కార్యదర్శి లక్ష్మీకర్, బలరాం, బండారు రాజశేఖర్, కేశవులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఓబులవారిపల్లి మండల కన్వీనర్ సి.హరి ప్రసాద్ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : టోల్‌గేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

'సీమ'ను రతనాలసీమగా మారుస్తాం

- ప్రాజెక్టుల ద్వారా తాగు, సాగునీరు
- 20 ఏళ్లు వెనక్కి వెళ్లిన ప్రాజెక్టులు
- మదనపల్లె సమ్మర్ స్టోరేజ్‌ను పూర్తి చేస్తాం
- ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాయలసీమను రతనాలసీమగా మార్చడమే టిడిపి ధ్యేయమని అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ పనిచేస్తున్నారని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. సమ్మర్ స్టోరేజ్ పనులను పరిశీలించేందుకు సోమవారం మంత్రి మదనపల్లెకు వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, పలువురు టిడిపి నాయకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, ఎమ్మెల్యే, నీటిపారుదల శాఖ ఇంజినీర్లతో కలిసి చిప్పిలి వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులను, మ్యాప్‌ను పరిశీలించారు. పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు ఇచ్చారు. నీటి నిల్వ ప్రాంతాలు, ట్యాంకు కింద ఉన్న భూములు తదితర విషయాలను అధికారులతో చర్చించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నీటిపారుదల శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. టిడిపి అధికారం చేపట్టిన 2014-2019లో హంద్రీ-నీవా కాలువ పనులను 90 శాతం పూర్తి చేస్తే ఆ తరువాత 2019లో అధికారం చేపట్టిన వైసిపి ప్రాజెక్టులను పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. హంద్రీ-నీవా ద్వారా 3850 క్యూసెక్కుల నీటి సరఫరాకు ప్రణాళిక రచించి 90 శాతం పనులను ఆనాటి టిడిపి పూర్తి చేస్తే మిగిలిన 10 శాతం పనులను వైసిపి పూర్తి చేయకపోవడంతో కాలువల్లో చుక్కనీరు లేకుండా పోయిందని విమర్శించారు. మదనపల్లెలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు 2014-19లో 90 నుంచి 95 శాతం పూర్తయితే కనీసం మిగిలి ఉన్న ఆ ఐదు నుంచి పది శాతం పనులు కూడా పూర్తి చేయకపోగా ఇక్కడ విధ్వంసం సృష్టించారని మండి పడ్డారు. సమ్మర్ స్టోరేజ్ వద్ద ఇసుకను దోపిడీ చేశారని ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా తవ్వేసి దోచుకున్నారని తెలిపారు. ట్యాంక్‌లో ఎక్కడ గోతులున్నాయో, ఎక్కడ సమాంతరంగా ఉందో తెలియక ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఇసుకను పూర్తిగా తోడెయ్యడంతో వర్షాధారం ద్వారా వచ్చే నీళ్ళు నిల్వ లేకుండా అడుగంటి పోవడం, లీకేజీ కావడం వంటివి జరుగుతాయని పేర్కొన్నారు. వీటన్నిటిని అరికట్టి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పనులను త్వరితగతిన



సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

పూర్తి చేసి మదనపల్లె ప్రజలకు తాగునీరు అందిస్తామన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పుల్లోకి కూరుకపోయిందని, వాటన్నింటిని పూడ్చుకుంటూ ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో నిర్మాణం చేసి ప్రజలకు సాగు, తాగునీరు అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. పరిపాలన దక్షత కలిగిన చంద్రబాబు నాయుడు వీటన్నిటిని అధిగమించి వచ్చే సీజన్ కల్లా హంద్రీ-నీవా కాలువను పూర్తిస్థాయిలో పారించి ప్రజలకు తాగు, సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్ఎ.మస్తాన్, యాలగిరి దొరస్వామి నాయుడు, జెసిబి మధు, వేణు, సంఘం శ్రీనివాసులు బ్రదర్స్, మాజీ కౌన్సిలర్లు తలారి రాధమ్మ, పులి మహాలక్ష్మి, నవీన్ చౌదరి, వరుణ్ తేజ, జనసేన నాయకులు జంగాల శివరామ్, బిజెపి నాయకులు బండి ఆనంద్, జర్మన్ రాజు ఇతరత్రా నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె: మండలం ముష్టూరులోని బహుదా ప్రాజెక్టుకు హంద్రీ-నీవా జలాలను అనుసంధానం చేయాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, తెలుగు యువత మండల అధ్యక్షులు చినబాబు మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. మంత్రికి వినతిపత్రం సమర్పించిన వారు మాట్లాడుతూ మండలంలోని బహుదా ప్రాజెక్టు కింద సుమారు 2800 ఎకరాలకు పైగా ఆయకట్టు భూమి ఉందని, రైతులు అత్యధికంగా వరి, టమోటా పంటలను సాగు చేస్తున్నారని తెలిపారు. రైతులను ఆదుకోవడానికి హంద్రీ-నీవా జలాలను బహుదా ప్రాజెక్టుకు అనుసంధానం చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, శ్రీనివాసులు, చంద్రాయుడు, రాజంపేట బిసి సెల్ అధికార ప్రతినిధి లక్ష్మన్న, రాజంపేట ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, సహదేవ పాల్గొన్నారు.

పేదల కడుపు నింపేందుకే అన్న క్యాంటీన్లు : మంత్రి

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలో ఎవరు ఆకలితో అలమటించకుండా పేదల కడుపు నింపాలనదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌ను కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి పూజా కార్యక్రమాలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి మాట్లాడుతూ పేదవారి ఆకలి తీర్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం తిరిగి అన్న క్యాంటీన్లు ప్రారంభించారని చెప్పారు. గతంలో అన్న క్యాంటీన్లకు ఎంతో ప్రాముఖ్యత ఉండేదని, అలాంటి వాటిని గత ప్రభుత్వం తీసేసిందని చెప్పారు. తిరిగి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పునఃప్రారంభించి పేదలు, కూలీల కడుపు నింపడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి విడతలో 100 క్యాంటీన్లను, రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 75 అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించామని తెలిపారు. క్యాంటీన్లలో రూ.5లకే ఉదయం ఇడ్లీ, పూరి, ఉప్మా, పొంగల్, చట్నీ, సాంబార్, లంచ్- డిన్నర్‌లో అన్నం, కూర, పప్పు, సాంబార్, పెరుగు, పచ్చడి ఇస్తారన్నారు. దినసరి కూలీలు, పరిశ్రమలలో పనిచే వారికి అనుగుణంగా రూ.5 లకే రుచికరమైన బోజనం పెట్టడం ప్రతి ఒక్కరు గర్వించదగ్గ విషయమన్నారు. ప్రతి క్యాంటీన్ వద్ద పూటకి 400 మందికి, రోజుకి 1200 మందికి టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి పూట భోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మున్సిపల్ కమిషనర్, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి

డ్వాక్రా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.

పేదలకు అన్నం వడ్డిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్

పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. గతంలో డ్వాక్రా సంఘాలకు ఇచ్చే రుణాలను రూ. 5 లక్షల నుండి రూ.10 లక్షల వరకు పెంచారని చెప్పారు. డ్వాక్రా మహిళలు ఉత్పత్తి చేసే బ్యాగులు, తిను బండారాలు తదితర వస్తువులను మెప్మా అర్బన్ మార్కెట్ ద్వారా విక్రయించుకుని ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. డ్వాక్రా సంఘాలు ఉత్పత్తి చేసే వివిధ రకాల ప్రోడక్ట్స్ ను నెలలో రెండు రోజులపాటు మెప్మా అర్బన్ మార్కెట్‌లో విక్రయించుకునేందుకు ప్రారంభించడం సంతోషించదగ్గ విషయమన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరిని డ్వాక్రా సంఘాలలో చేర్పించి సంఘాల బలోపేతానికి డ్వాక్రా సభ్యులు కృషి చేయాలన్నారు.

నేడు గోపనపల్లెలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి - గాలివీడు : మండలంలోని గోపనపల్లిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోపనపల్లి టిడిపి నాయకుడు మిట్టపల్లి వెంకటరమణరెడ్డి, డాక్టర్ కోటిరెడ్డి ఒకప్రకటనలోపేర్కొన్నారు మంత్రిరవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హాజరవుతున్నారని జిల్లా స్థాయి అధికారులకు హాజరవుతున్నారని గ్రామంలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లాలోని రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా హిందీ సబ్జెక్టు బోధించడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం. ప్రకాష్ సోమవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఎంఎ హిందీలో 50 శాతం మార్కులు కల్గి ఉండాలన్నారు. ఈనెల 24న మధ్యాహ్నం రెండు గంటలకు ఒరిజనల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

వైద్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - సుండుపల్లి

డాక్టర్ మౌనిక సేవలు అభినందనీయమని టిడిపి నాయకులు డాక్టర్ ఎర్రపురెడ్డి శరత్‌గిరిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రం సమీపంలోని గుళ్లవాండ్లపల్లి వెంగబరాజుగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు, అంగన్వాడీ చిన్నారులకు తన తల్లి మాజీ సర్పంచ్ నిర్మలమ్మ జ్ఞాపకార్థం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మందులు, బ్రష్‌లు, పేస్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శరత్‌గిరిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యం కోసం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించామని పేర్కొన్నారు. అనంతరం తిరుమల మందులు షాపు నిర్వాహకులు రమేష్ ఆచారి ఆధ్వర్యంలో ఆయన కుమార్తె డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండే దంతాలు శుభ్రం చేసుకోవడం అలవాటుచేసుకోవాలన్నారు. ఎంఇఒ రవి నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం ఈ పాఠశాలను ఎర్రపురెడ్డి శరత్గిరిరెడ్డి ఎంతో అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. శిబిరంలో దాదాపు 150 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో శారద ఉన్నత పాఠశాల నిర్వాహకులు సీతారామరాజు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటరమణ, విద్యా కమిటీ చైర్మన్ రాచరాయుడు, స్థానికులు నాగిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, కృష్ణవేణి, ఉపాధ్యాయులు ఆంజనేయులు, పార్వతమ్మ, రేణుకాదేవి, అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆయాలు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చొప్పా గంగిరెడ్డి

ఔషధ దుష్ఫలితాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ఔషధ దుష్ఫలితాలపై రోగికి అవగాహన కలిగి ఉండాలని అన్నమాచార్య కళాశాల కార్యదర్శి డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలిపారు. స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో అడ్వర్స్ డ్రగ్ రియాక్షన్ మానిటరింగ్ సెంటర్ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. కార్యక్రమంలో క్విజ్ తో పాటు ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించి విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ముగింపు సందర్భంగాకళాశాల కార్యదర్శి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ కార్యక్రమం నిర్వహణ అధికారి గిరి రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంతో విద్యార్థులు ఔషధ దుష్ఫలితాలపై గొప్ప అవగాహన పెంచుకున్నారని తెలిపారు.

కిరణ్‌కు జ్యోతిష్యరత్న పురస్కారం

ప్రజాశక్తి-పీలేరు : పీలేరు నివాసి దివంగత విరూపాక్షం సూర్యనారాయణ శాస్త్రి అల్లుడు సూత్రంసిద్ధి కిరణ్ కుమార్ శర్మకు జ్యోతిష్య, వాస్తురత్న పురస్కారం వరించింది. హైదరాబాదుకు చెందిన విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ తిరుపతి వైస్రాయ్ హోటల్లో వైదిక జ్యోతిష సమ్మేళనం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులైన అర్చకం వేణుగోపాల దీక్షితులు, శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జోతిష్య, వాస్తు శాస్త్రాల్లో విశేష కృషి చేస్తూన్న సూత్రంసిద్ధి కిరణ్ కుమార్ శర్మను సంస్థ గుర్తించి జ్యోతిష్య, వాస్తు రత్న పురస్కారం ప్రధానం చేసి గౌరవ సత్కారం చేశారు. ఈ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 200 మంది వాస్తు, జ్యోతిష్య పండితులు హాజరయ్యారు. ఈ కార్యక్రమ ఉపన్యాసకులుగా పుచ్చా శ్రీనివాసరావు, ఇంద్రగంటి వేంకట గోపాలకృష్ణ శర్మ, పాలపర్తి శ్రీకాంత్ శర్మ, చక్రధర్ సిద్ధాంతి తదితరులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న కిరణ్

రూపానందరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఓబులవారిపల్లె (పుల్లంపేట)

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి అన్నారు. సోమవారం ఓబులవారిపల్లి మండల పరిధిలోని కాకర్లవారిపల్లెలో రూ.7.52 కోట్లతో సిమెంట్ రోడ్డు, తుమ్మకొండ నుండి చిన్నఓరంపాడు వరకు తారు రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కొన్ని ఏళ్లుగా సరైన రోడ్లు లేక, ఆస్పత్రులకు వెళ్లాలనుకున్న కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల లోపల మా గ్రామానికి దిశ దశ మారుస్తున్న రూపానందరెడ్డికి గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం గ్రామస్తులు రూపానందరెడ్డి, సాయి వికాస్‌రెడ్డి, ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించడానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఏ గ్రామంలోనైనా రోడ్డు లేకపోతే తమ దృష్టికి తీసుకుని వస్తే తక్షణం రోడ్డు వేయించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి గ్రామానికి విద్యుత్, తాగునీరు, రోడ్లు ఉండాలన్నారు. అవి ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడంలో తమ కుటుంబం నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసమే శ్రమించడానికి ముందుంటామని రూపానందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బోట్ల మీదపల్లి పంచాయతీ సర్పంచ్ వీరపునేని వెంకటయ్య నాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ ఇఇగా యుగంధర్

ప్రజాశక్తి - రాయచోటి



రాయచోటి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా సోమవారం పి.యుగంధర్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో మదనపల్లి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా తిరుపతి డిపిఇ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేశారు. బదిలీలలో భాగంగా తిరుపతి డిఇఇ నుంచి రాయచోటి డివిజన్‌కు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన తరువాత మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. పి.యుగంధర్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, పలు విధ్యుత్ కార్మిక సంగాల నాయకులు, కార్మికులు, శుభాకాంక్షలు తెలిపారు.

'వ్యవసాయ అభివృద్ధికి విశేష కృషి'

ప్రజాశక్తి-రామాపురం: వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' ప్రజాదర్బార్ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే తమ ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటానికి ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం, బుధవారాల్లో ఉదయం ఒక గ్రామం సాయంత్రం ఒక గ్రామంలో నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 8:30 నుంచి 10 గంటల వరకు వ్యవసాయ క్షేత్ర సందర్శన, 10 నుంచి 12 గంటల వరకు గ్రామ సభ, అలాగే మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు గ్రామసభ నాలుగు నుంచి 5:30 గంటల వరకు వ్యవసాయ క్షేత్ర సందర్శన చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను వ్యవసాయ అధికారులకు తెలియజేసి నూతన వ్యవసాయ పద్ధతులను పాటించి రైతులు అభివృద్ధి చెందాలన్నారు.

గొప్ప సైద్ధాంతిక వేత్త సీతారాం ఏచూరి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గొప్ప సైద్ధాంతిక వేత్త సీతారాం ఏచూరి అని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. సోమవారం స్థానిక జ్ఞానంభిక డిగ్రీ కాలేజీలో సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం అహర్నిశలూ పోరాడిన వ్యక్తి మరణం బాధాకరమని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుండి సిపిఎం అఖిల భారత నాయకుడిగా ఎదిగిన ఏచూరి తెలుగువాడు కావడం గర్వకారణమన్నారు. ప్రజాస్వామ్య విలువల కోసం ఆయన నిరంతరం అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. ఇందిరాగాంధీ అంటేనే భయపడుతున్న సమయంలో ఆమె ఎదురుగా నిలబడి యూనివర్సిటీలో ఛాన్సలర్ పదవికి రాజీనామా చేయాలని కోరిన ధీరుడని కొనియాడారు. ఎక్కడున్నా తెలుగు ప్రజలకు, తెలుగు నేలకు ఆత్మబంధువుగా ఉన్నారని వివరించారు. ఆయన జీవితం మొత్తం దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడారని తెలియజేశారు. పెట్టుబడుల ఉపసంహరణకు, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. ఆయనకు అధికారం ముఖ్యం కాదని, ఈ తరం రాజకీయ నాయకులకు ఆయన జీవితం పాఠంగా ఉండాలని పేర్కొన్నారు. అమెరికాతో అణు ఒప్పందం చేసుకున్న సమయంలో దేశ సార్వభౌమత్వానికి ఈ ఒప్పందం ముప్పుగా పరిణమిస్తుందని బలంగా వ్యతిరేకించారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలోనూ, రాష్ట్రాల హక్కుల విషయంలో ఆయన ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్న ఈ సమయంలో ఆయనను కోల్పోవడం తీరని లోటని పేర్కొన్నారు. జ్ఞానంభిక డిగ్రీ కాలేజీ కరెస్పాండంట్ రాటకొండ గురుప్రసాద్ మాట్లాడుతూ ఏచూరి కోట్లాది మంది హృదయాల్లో చిరస్మరణీయుడుగా నిలిచిపోతారని పేర్కొన్నారు. విలక్షణమైన వ్యకి అని, అందరినీ కలుపుకుని పోయే ఆయన మనస్తత్వం అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తెచ్చిందన్నారు. ఆహార భద్రతా చట్టం, ఆర్‌టిఐ లాంటి పలు చట్టాలు తీసుకురావడంలో ఏచూరి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాగా ఇష్టపడే వ్యక్తి సీతారాం ఏచూరన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ సీతారాం ఏచూరి పేదల ముద్దుబిడ్డ అని పేర్కొన్నారు. జీవించినంత కాలం పేదల సంక్షేమం కోసం కృషి చేశారని, చట్టసభల్లోనూ పోరాడారని పేర్కొన్నారు. భాషా సాంస్కృతిక వైవిధ్యంతోనూ, ప్రజలతోనూ ఆయనకు సంబంధం ఉందని తెలిపారు. అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని వివరించారు. రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్ర ఐక్యత కోసం గళం విప్పారని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా సీతారాం ఏచూరి అందరికీ ఇష్టమైన వ్యక్తని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరిశర్మ, కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ నాయకులు సిద్దప్ప, నీలకంఠ, విద్యాసాగర్, పాల్గొన్నారు.

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



నిజాన్ని నిర్భయంగా రాస్తూ, ప్రజల పక్షాన నిలిచి నేడు 44వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా పాఠకులకు, సిబ్బందికి, విలేకరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు

షేక్ అతావుల్లా
మైనారిటీ సెల్, రాయచోటి

షేక్ ఇనాముల్లా
తెలుగుయువత అధ్యక్షులు, రాయచోటి

షేక్ హనీఫ్
కువైట్ఎన్ఆర్ఐ, రాయచోటి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పొలం పిలుస్తోంది కార్యక్రమం మండలంలో ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం పోస్టర్లను ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళ, బుధవారాల్లో రెండు రైతు సేవా కేంద్రాల పరిధిలో వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశుసంవర్ధక శాఖ అధికారులు రైతుల పొలాల్లో పర్యటించి వారికి సమస్యలను గురించి చర్చించి అవసరమైన సాంకేతిక సలహాలను ఇవ్వడం కోసం ఈ కార్యక్రమం నిర్వహించబడుతోందన్నారు. అవసరమైన చోట్ల పొలాల్లోకి శాస్త్రవేత్తలు బృందాలను కూడా తీసుకువచ్చి వారి చేత పొలాల్లోని చీడపీడల సమస్యల పరిష్కారానికి క్షేత్ర పరిశీలన ఏర్పాటు చేశామన్నారు. రైతులకు కావలసిన ఇతర అంశాలను పైఅధికారులకు నివేదించడం కొరకు ఒక అనుసంధాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకుని తగిన సాంకేతిక సలహాలు రైతులు పొందాలన్నారు. మంగళవారం మదనపల్లి మండలం, బసినికొండ, కొండామర్రిపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి శివశంకర్, మదనపల్లి నియోజకవర్గ వ్యవసాయ అధికారులు నాగప్రసాద్, మోహన్ కుమార్, మురళీమోహన్, ఉద్యాన అధికారి ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి, టిడిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చమ్మర్తి జగన్మోహన్‌రాజు, నాదెళ్ల విద్యాసాగర్, గంగారపు రామ్మూర్తి నాయుడు, బొమ్మిశెట్టి పురుషోత్తం, సూదీళ్ల సుధాకర్, విజయమ్మ, కత్తి లక్ష్మన్న, పఠాన్ ఖాదర్ ఖాన్, మార్పురి నాగార్జున బాబు, నవీన్ చౌదరి, చుక్కా విజయకుమార్ పాల్గొన్నారు.

వినికిడి యంత్రాలను అందజేస్తున్న ఉదయ్ మోహన్‌రెడ్డి

వృద్ధురాలికి వినికిడి యంత్రం అందజేత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలోని వెలుగు సంస్థ (వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమం) ఆవరణంలో వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి వృద్ధ బధిరులకు ఉచితంగా వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. అన్నమయ్య జిల్లా, గొల్లపల్లి, శీతివారిపల్లికి చెందిన శాంతమ్మ, బి.కొత్తకోట మండలం, బీరంగికి చెందిన ఎస్.సీతారామిరెడ్డిలకు వినికిడి యంత్రాలను అందజేశారు. బిజెపి రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు లోకేష్ కుమార్ వెలుగు సంస్థకు విచ్చేసి వృద్ధులకు ఉచితంగా మరిన్ని వినికిడి యంత్రాలను అందజేశారు.

'ఇది మంచి ప్రభుత్వం' ఇంటింటా కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-వాల్మీకిపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పథకాలు ఇంటింటికి వెళ్లాలని టిడిపి మండల అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను పంచి పెట్టారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర మంతా అవ్వతాతలకు ఒకేసారి పింఛన్ సౌకర్యం కల్పించిన ఘనత ముఖ్య మంత్రికే దక్కిందన్నారు. అన్నా క్యాంటీన్, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, నిరు ద్యోగ యువతకు డిఎస్‌సి, రైతుల దగ్గర దాన్యం కొనుగోలు, వరదల్లో నష్ట పోయిన ప్రతి కుటుంబానికి చేయూత వంటి కార్యక్రమాలు మన ప్రభుత్వంలో సూపర్ సక్సెస్ అయ్యామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి 00 రోజులు పూర్తి అయి అభివృద్ధి సంక్షేమంతో దూసుకుపోతున్న సంద ర్భంగా మండల వ్యాప్తంగా ప్రతి సచివాలయం పరిధిలో కూటమి నాయ కులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులతో కలసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి ఇంటింటా తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయ కులు కోసూరి రమేష్, చంద్రమౌళి, పివి నారాయణ, గోవిందు, మధు, రెడ్డి పాల్గొన్నారు. **తంబళ్లపల్లె:** కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కావ డంతో కూటమి ప్రభుత్వం చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను, చేపట్టిన పనుల వివరాల పాంప్లెంట్లను ఇంటింటికి పంచుతూ ప్రచారం చేపట్టారు. ఎంపిడిఒ సురేంద్రనాథ్, యుపిఆర్‌డి దిలీప్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రమణ, కూటమి నాయకులు గుండ్లపల్లిలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు.

ప్యారంపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-రామాపురం

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తమ ధ్యేయమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రామాపురం మండలంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' ప్రజా దర్బార్ కార్యక్రమానికి మంత్రి, కలెక్టర్ శ్రీధర్ చామకూరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఐదేళ్లల్లో ప్రజలు ఎన్నో కష్టాలు ఎదుర్కొని నానా ఇబ్బందులకు గురయ్యారని నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. పాలన 100 రోజులు పూర్తయిన శుభ సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అని పండుగ వాతావరణంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో ప్రజలు కష్టాలు భరించలేక కూటమి ప్రభుత్వానికి భారతదేశంలోనే ఏ పార్టీకి దక్కనన్ని 161 స్థానాలను ఇచ్చారన్నారు. దీంతో కేవలం వంద రోజులలోనే వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల నుంచి ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల మన్ననలు పొందామని తెలిపారు. గతంలో ముష్టి వేసినట్లు అరకొర పెన్షన్లను అవ్వ తాతలకు అందించి పెన్షన్ దారులను ఇబ్బంది పెట్టారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒకేసారి వెయ్యి రూపాయల పెన్షన్ పెంచి ప్రతినెల 1వ తేదీనే నాలుగు వేల రూపాయలు పెన్షన్ ఇస్తున్నారని చెప్పారు. రాయచోటి నియోజకవర్గంలోని రాయచోటి, తంబళ్లపల్లె, పీలేరు, నియోజకవర్గాలలో నీటి సమస్య అధికంగా ఉందని పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తారన్నారు. అన్నమయ్య జిల్లాలో రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతారని చెప్పారు. రాబోయే ఐదు సంవత్సరాలలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి రాయచోటి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజక వర్గంగా తీర్చి దిద్దుతామని చెప్పారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో అర్హులందరికీ పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తారని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన శుభ సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తారని చెప్పారు. ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చున్నారు. జిల్లాలో అర్హులందరికీ ప్రతినెల 1వ తేదీనే పింఛన్లు ఇస్తారన్నారు. జిల్లాలో ఇసుక సమస్య లేకుండా రీచ్ ల ద్వారా ఇసుక సరఫరా చేస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సి ద్వారా 16,437 టీచర్ పోస్టులు పారదర్శకంగా భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను నివారించేందుకు చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, ఆర్‌డిఒ రంగస్వామి, డిపిఒ ధనలక్ష్మి, వివిధ శాఖల అధికారులు ప్రజలు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

బోరును ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సిమెంట్ రోడ్డు ప్రారంభం : బండపల్లి పంచాయతీలోని కమ్మరాయిని గుట్ట, మహా విష్ణు ఆలయానికి బండపల్లి టోల్ ప్లాజా నుంచి రూ..70 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును మంత్రి ప్రారంభించారు. చిట్లూరు పంచాయతీ మాలపల్లెలో ఏర్పాటు చేసిన బోరు, పైప్‌లైన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు

జిల్లాలోని ప్రాజెక్టులపై దృష్టి సారించాలి : 'చమర్తి'

మంత్రి రామానాయుడును సన్మానిస్తున్న జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేటతో పాటు అన్నమయ్య జిల్లాలో ప్రజల తాగు, సాగు అవసరాలు తీర్చే అన్నమయ్య, పింఛా, గాలేరు-నగరి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేసి ఇక్కడి ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు కోరారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలోని తంబళ్లపల్లె నియోజకవర్గానికి విచ్చేసిన మంత్రిని కలిసి అన్నమయ్య జిల్లాలో ఉన్న పలు ప్రాంతాల నీటి సమస్యలను ఆయన వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా చమర్తి మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యానికి రాజంపేట ప్రజల కల్పవృక్షంగా ఉన్న అన్నమయ్య ప్రాజెక్టు నీటిపాలైందని, అలాగే పింఛా ప్రాజెక్టును కూడా అత్యాశపరులు పొట్టన పెట్టుకున్నారని, ఆ దుర్ఘటనలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాల పరిపాలనలో అన్నమయ్య ప్రాజెక్టును కానీ, పింఛా ప్రాజెక్టును కానీ, వరద బాధితులను కానీ తిరిగి పూర్వ వైభవానికి తెచ్చేందుకు ఆనాటి ప్రభుత్వం ఏమాత్రం ఆలోచించలేదన్నారు. అతి త్వరలో అన్నమయ్య, పింఛ ప్రాజెక్టుల పునర్నిర్మాణం పనులను ప్రారంభించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగు, సాగు మీరు అందించే బాధ్యతను తెలుగుదేశం ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. అన్నమయ్య జిల్లాలో అన్ని ప్రాంతాలకు వీలైనంత త్వరగా వివిధ మార్గాల ద్వారా నీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు తెలియజేశారని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీమా రంగంలో ధృవతార ఎల్ఐసి

కార్మిక వర్గానికి అవగాహన, ఆచరణ, సంఘీభావం ముఖ్యం
ఎల్ఐసి యూనియన్ జోనల్ నేత తిరుపతయ్య

మహాసభలో మాట్లాడుతున్న తిరుపతయ్య, వివిధ డివిజన్ల నుంచి హాజరైన ప్రతినిధులు

ప్రజాశక్తి - కడప అర్బన్

బీమా రంగంలో కేంద్ర ప్రభుత్వం ఆలో చిస్తున్న మార్పుల నేప థ్యంలో పాలసీదారుల సేవ లను మరింత మెరుగుపరచి వారితో బంధాన్ని ధృఢ పరచుకుని ఎల్ఐసి బలోపేతానికి అందరూ కృషి చేయాలని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎం ప్లాయిస్ ఫెడరేషన్ సహాయ కార్యదర్శి జి.తిరు పతయ్య పిలుపునిచ్చారు. కడప డివిజన్ యూని యన్ మహా సభలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కార్మికుల కర్తవ్యాలను ప్రబో ధించారు. కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడినా, పదేళ్ళ విభజన విధానాలకు, ఆర్థిక విధానాలకు ప్రజలు మద్దతివ్వలేదన్నారు. దేశాల మధ్య సమస్యలు పరిష్కరిస్తామని గొప్పలు పోయే బదులు దేశంలోని మణిపూర్ సమస్యను పరిష్కరించేందుకు, కోల్‌కత్తా జూని యర్ డాక్టర్‌పై అత్యాచారం లాంటి సంఘ టనలను నివారించే దిశగా ప్రభుత్వం పని చేయాలన్నారు. నిరుద్యోగాన్ని నివారి ంచాలని, ప్రభుత్వం చెబుతున్న ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకం లోప భూయిష్టమైందని అన్నారు. పర్మనెంట్ ఉద్యోగాలకు బదులు అప్రె ంటీసు నియామకాలంటే శ్రమదోపిడికి అవకా శం ఇవ్వడమే అన్నారు. భిన్నత్వంలో ఏకత్వమే అసలైన భారతీయత అని, దీనిని ఆటంకపరిచే వారిని ఉపేక్షిం చరాదని అభిప్రాయపడ్డారు. సమకాలీన పరిస్థితులపై అవగాహనతో సోదర సంఘాలతో సంఘీభావ కార్యక్రమాలను చేపడు తూ ముందుకు సాగాలన్నారు. మహాసభల్లో కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ జి కె ఆర్ వి రవికుమార్ సందేశం ఇచ్చారు. జోనల్ కోశా ధికారి ఆర్.శ్రీనివాసన్, సంఘాల ప్రతినిధులు చంద్రపాల్, రామాంజనేయులు, సుధీకర్, కామ నూరు శ్రీనివాస్‌రెడ్డి, అజీజ్, హరి, సుబ్బారెడ్డి మాట్లాడారు. మహాసభలకు డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ అధ్యక్షత వహించారు, యూనియన్ పతాకావిష్కరణ చేశారు, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి ప్రవేశపెట్టిన కార్యవర్గ నివేదిక ఆమో దించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అవధానం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పి.అయ్యవారురెడ్డి, వై. కళ్యాణ్, కెపి సూరిబాబు, పిఎస్ రవిబాబు, ఆదోని, ప్రధాన కార్యదర్శిగా ఎ.రఘునాథరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా జి.వారిజాతమ్మ, కెసిఎస్ రాజు, ఎస్ శ్రీనివాసులు, ఆర్.సునీయకుమార్, కోశాధి కారిగా అమీనాపర్వీన్, సహాయ కోశాధికారిగా, పి.రత్న కిషోర్, జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎస్. అక్బర్ బాషా ఎన్నికయ్యారు.

జెసిబితో చెరువు కట్ట తొలగించిన ప్రాంతాన్ని చూపుతున్న రైతులు

చెరువు కట్ట తొలగింపు

పట్టని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
దిక్కుతోచని స్థితిలో బాధితులు

ప్రజాశక్తి - రామసముద్రం

ఆక్రమణదారులు చెరువు కట్ట తొలగించారని మండల ఉన్నతాధికారులకు తెలిపినా పట్టించుకోలేదని మండలంలోని ఎలకపల్లి గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బాధిత రైతులు మాట్లాడుతూ ఎర్రబోయినపల్లి గ్రామం వద్ద ఎగవకుంట దిగువకుంట కింద రెడ్డప్పరెడ్డి, వెంకటరమణారెడ్డి నారాయణరెడ్డిలకు వ్యవసాయ భూమి ఉందని తెలిపారు. ఎర్రబోయినపల్లికి చెందిన వ్యక్తి కుంట కట్టపై జెసిబితో కుంటలో నీరు నిలవకుండా తీసివేశాడని తెలిపారు. వర్షం వచ్చి కుంటలోకి వర్షపు నీరు చేరితే కట్ట తెగిపోయే ప్రమాదం పొంచి ఉందని అదే జరిగితే తమ పొలాలు మునగడంతో పాటు కట్టకు గండి ఏర్పడే ప్రమాదం ఉందని తెలి పారు. దాదాపు కుంట దూరాక్రమనకు గురైందని వాపోయారు. ఈ విష యంపై రామసముద్రం మండల ఇరిగేషన్ అధికారి శ్రీధర్‌కు 20 రోజుల క్రితం ఫిర్యాదు చేశామని చెప్పారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన ఇంతవరకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ శ్రీధర్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్లాస్టిక్ బాటిల్‌తో వివిధ వస్తువులను తయారు చేసిన విద్యార్థులు

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమ వారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలలో రెడ్యూస్, రీ యూస్, రీ సైక్లింగ్‌లో భాగంగా పాఠశాల పరిసర ప్రాంతాలలో ఉన్న ప్లాస్టిక్ బాటిల్స్ ఉపయోగించి పూల తొట్టెలు, వేలాడే పూల తొట్టెలు, స్పూన్స్, ఫ్లవర్ వాజులు, పెన్ స్టాండ్స్, డస్ట్ బిన్స్, హ్యాంగర్స్ తయారు చేశామని ఉపాధ్యాయుడు రమణ తెలియ జేశారు. ఉపాధ్యాయులు రమణ మాట్లాడుతూ ప్లాటిక్ వల్ల జరిగే అనర్థాలను చక్కగా వివరించి, ప్లాస్టిక్ వల్ల జరిగే నష్టాన్ని అరికట్టాలంటే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, ప్లాస్టిక్ వస్తువులు మరలా మరలా వాడాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు కావున వాళ్ళ ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, వాటిని తిరిగి ఎలా వాడాలో నేర్పాలన్నారు. పిల్లలు ఎంతో ఉత్సాహంగా వారి తల్లిదండ్రులు సహాయంతో ప్లాస్టిక్ బాటిల్స్‌తో వివిధ వస్తువులు తయారు చేశారు.

భగత్‌సింగ్ జయంతిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈ నెల 28న ఎస్.వి.యూనివర్సిటీలో నిర్వహించ తలపెట్టిన భగత్ సింగ్ 117వ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జెఎసి పిలుపునిచ్చింది. సోమవారం విజయభారతి విద్యా సంస్థలలో భగత్ సింగ్ జయంతి వేడుకల గోడపత్రికలను పాఠశాల అధినేత డాక్టర్ ఎన్.సేతు, అప్పుస్మా జిల్లా అధ్యక్షులు రఘునాథ రెడ్డి, సభ్యులు కేశవరెడ్డి, రాటకొండ రమేష్, వెంకటేష్, కృష్ణప్ప, ప్రయివేట్ టీచర్స్ యూనియన్ నాయకులు మల్లికార్జున, జూనియర్ కళాశాల కిరణ్, ఎపిఎస్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి ఉత్తన్న, జిల్లా అధ్యక్షులు గంగరాజు, మొహ్సిన్, షాఫాన్, ఇర్ఫాన్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.సేతు మాట్లాడుతూ 200 సంవత్సరాలు భారతదేశాన్ని పరిపాలించిన బ్రిటీష్ వారిపై మా దేశాన్ని మాకివ్వండి, మాకు స్వాతంత్ర్యం కావాలని నినదిస్తూ స్వాతంత్ర్యం కొరకు ఉరి కంబాన్ని ముద్దాడిన యువకుడి త్యాగాన్ని గుర్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇలాంటి మహానుభావుల చరిత్రలను పాఠ్యాంశాలుగా సిలబస్ నందు పొందు పరచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశం కొరకు ప్రాణాలర్పించిన వారిని గుర్తు చేసుకోవడంలో ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జెఎసి ఎప్పుడూ ముందు వరసలో ఉంటుందని ప్రశంసించారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని రైతు దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

లారీ ఢీకొని రైతు దుర్మరణం పాలైన విషాదకర సంఘటన ఆదివారం రాత్రి తంబళ్లపల్లె మండలంలో చోటు చేసుకుంది. తంబళ్లపల్లి ఎస్ఐ లోకేశ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మొరంమీదపల్లికి చెందిన రైతు శేషాద్రిరెడ్డి(45) సొంత పనిమీద బైక్‌లో ములకలచెరువు మండలం, బురకాయల కోటకు వెళ్లాడు. వెళ్లిన పని ముగించుకుని, తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళుతుండగా బురకాయలకోటలోని పెట్రోల్ బంకు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో మదనపల్లి సర్వజన బోధనాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం అతన్ని బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె, పుంగనూరు రోడ్డుపై సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో భవన కార్మికుడు మృత్యువాత పడ్డాడు. రోడ్డు పక్కన నిలబడి టీ తాగుతుండగా బొలెరో రూపంలో వచ్చిన మృత్యువు భవన కార్మికున్ని కబలించింది. తీవ్ర విషాదాన్ని నింపిన ఘటనకు సంబంధించి మృతుని కుటుంబ సభ్యులు, మదనపల్లె తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పుంగ నూరు మండలం, ఈడిగిపల్లె కొత్త ఇండ్లకు చెందిన మునిరత్నం కుమారుడు నరేశ్ కుమార్(35) భవన నిర్మాణం పనులు చేస్తూ భార్య పిల్లలను పోషించు కుంటూ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్నాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే మదన పల్లిలో భవన నిర్మాణం పనులు చేయడానికి సోమవారం ఉదయం ఇంటిదగ్గర నుంచి బైకులో బయలు దేరాడు. మార్గమధ్యంలోని పుంగనూరు రోడ్డు కృష్ణాపురం జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద బైకు ఆపి రోడ్డు పక్కన నిలబడి టీ తాగుతుండగా, పుంగనూరు నుంచి మదనపల్లె మార్కెట్‌కు టమోటాలను తీసుకెళ్తున్న బొలెరో వాహనం టీ తాగుతున్న నరేష్ కుమార్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నరేష్ కుమార్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సిఐ కళా వెంకటరమణ సిబ్బందితో ఘటనా స్థలం వద్దకు చేరుకునే మృతదేహాన్ని పరిశీలించి పంచనామా అనంతరం పోస్టు మార్టం కోసం జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న బిడ్డ ఇక లేడని తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ విలపించడం చూపరులను తీవ్రంగా కలిచి వేసింది. ఇక మాకు దిక్కెవరంటూ భార్యాపిల్లలు రోదనలు మిన్నంటాయి. నరేష్ కుమార్ మృతితో కొత్త ఇండ్లలో విషాదఛాయలు అలము కున్నాయి. భవన కార్మికుడు మృతికి కారణమైన బొలెరో డ్రైవర్ పరారు కావడంతో ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

IN THE COURT OF THE XI ADDITIONAL DISTRICT JUDGE: PILER

G.W.O.P No. 8 OF 2024

(In the matter of Minors T. Manitheja, S/o T. Gopala Krishna & T. Meenakshi, D/o T. Gopala Krishna).

1. C. Srinivasa, S/o Late C. Chinnaiah, Indian, Hindu, aged about 42 years, living by cultivation, r/at Chinnapalli, Kotabaillapalli, Srinivasapur, Mulabagal Taluq, Kolar District 563 135, Karnataka State.
2. T. Manitheja (Minor)
3. T. Meenakshi (Minor)

2&3 are minors represented by guardian Maternal uncle (mena mama) i.e.,1st petitioner herein.

2 & 3 petitioners are the natives of Pillagovula varipalli, H/o Tharigonda Post, Gurramkonda Mandal, Annamayya District, A.P., presently residing with their maternal uncle 1st petitioner.

...Petitioners

Vs

Nil. ...Respondents

జనరల్ నోటీసు

ఇందుమూలముగా గ్రామయావన్మందికి తెలియచేయడమేమనగా, పైకనిన 2 & 3 మైనర్ పిటీషనర్ల తల్లిగారైన T. ప్రమీల, ఆమె జీవితకాలములో 1) సప్తగిరి గ్రామీణ బ్యాంకు, తరిగొండ మరియు 2) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బర్మా స్ట్రీట్ బ్రాంచ్, మదనపల్లి లలో బంగారు నగలు కుదువ పెట్టి, వాటిని విడిపించకుండానే మరణించినది. మరియు సదరు మైనర్ పిటీషనర్ల తండ్రి T. గోపాల క్రిష్ణ, పైకనిన T. ప్రమీల మరణానికి ముందే మరణించినాడు. అందువల్ల పై కనిన 2 & 3 మైనర్ పిటీష నర్లు వారి యొక్క మేనమామ అయిన C. శ్రీనివాస (మొదటి పిటీషనర్) యొక్క సంరక్షణలో ఉన్నారు. అయితే పైకనిన రెండు బ్యాంకులలోని బంగారు నగలను సదరు బ్యాంకులకు చెల్లించవలసిన మొత్తం బాకీని చెల్లించి, మైనరు పిటీషనర్ల తరపున సదరు బంగారు నగలను సదరు బ్యాంకుల నుండి విడిపించి, తీసుకోవడానికి పై కనిన C.శ్రీనివాస (మొదటి పిటీషనర్), మైనర్ పిటీషనర్ల సంరక్షణకర్తగా వ్యవహరించుటకు అనుమతిని కోరుతూ పై దావాను దాఖలు చేసి వున్నారు. ఈ విషయమై ఎవరికైనను ఎలాంటి అభ్యంతరము ఉన్నచో, పై కోర్టు ఎదుట తేది:04-10-2024 ఉదయం గం.10.30 ని. హాజరు అయి వారి యొక్క అభ్యంతరాలు తెలుపుకొనవచ్చును.

//By Order of the Court//

P.V. RAMANA REDDY

Advocate, Piler.

Cell No: 9885287755

విద్యుత్ వైర్ల చోరీని అరికట్టాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండల పరిసర గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ వైర్ల చోరీలను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని విద్యుత్ శాఖ డిఇఇ ఎం.భాస్కరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గృహ, వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన కాపర్ వైర్‌ను తరచుగా కొందరు వ్యక్తులు దొంగలించడం జరుగుతోందని పేర్కొన్నారు. నాగవరం, ఓబనపల్లి, ఇలా కొన్ని గ్రామీణ ప్రాంతాలలో దొంగలు కాపర్ వైర్, ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్‌ను చోరీ చేస్తున్నారని తెలిపారు. మండల ప్రజలు ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు గమనిస్తే విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. ఈ చోరీలు అరికటేందుకు సహకారం అందించవలసిందిగా మనవి చేశారు. రాత్రి వేళల్లో మీ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లను గమనించవలసిందిగా కోరారు.

ఉచిత ఎముకల సాంద్రత పరీక్ష

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జండు కంపెనీ వారి సౌజన్యంతో స్థానిక ప్రశాంత్ నగర్‌లో ఆయుర్వేద డాక్టర్ దివ్య, డాక్టర్ దీప్తి సంయుక్తంగా నిర్వహిస్తున్న బెటర్ లైఫ్ ఆయుర్వేదిక్ హాస్పిటల్, పంచకర్మ సెంటర్‌లో సోమవారం ఉచిత ఎము కల సాంద్రత పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 122 మంది హాజరై ఈ అవకాశాన్ని వినియోగిం చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయసు పెరిగేకొద్దీ ఎముకల్లో శక్తి క్షీణిస్తుందన్నారు. సకాలంలో ఎముకల సాంద్రత పరీక్షలు చేసుకుని తగు మందులు వాడితే అస ప్రభావం పెరగకుండా నియంత్రిచ్చ వచ్చన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం మనం తీసుకుంటున్న ఆహారం, నీళ్లు కల్తీ అవ్వడం వల్ల ఎముకల పటిష్టత దెబ్బ తింటోందన్నారు. కావున ఎప్పటికప్పుడు పరీక్షలు చేసుకుని తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జండు కంపెనీ సీనియర్ మేనేజర్ ఏసురత్నం, ఏరియా సేల్స్ ఎగ్జిక్యూటివ్ బి.శ్రీనివాసులు, టెక్నీషియన్స్ రఘువీర్, జి.సునంద, దినేష్, విశ్రాంత ఉద్యోగులు శంకరయ్య, మునివెంకటప్ప హాజరయ్యారు.

లడ్డూ అపవిత్రం దుర్మార్గం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

శ్రీవెంకటేశ్వర స్వామికి అత్యంత ప్రీతిదాయాకమైన లడ్డూని ఆవు, పంది కొవ్వుతో తయారు చేసిన నూనెను ఉపయోగించి అపవిత్రం చేయడం చాలా దుర్మార్గమని రాజంపేట టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ విచారం వ్యక్తం చేశారు. సోమవారం మదనపల్లిలోని తన కార్యాలయంలో విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే కాకుండా ప్రపంచ నలుమూలల ఉన్న హిందువుల మనోభాలను దెబ్బతిసిన మాజీ ముఖ్యమంత్రి జగన్, టిటిడి మాజీ ఛైర్మన్ అయిన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ ఇఒ ధర్మారెడ్డిపై సిబిఐ విచారణ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. కాసులకు కక్కుర్తి పడి వడ్డీకాసుల వాడిని మోసం చేశారని ఎద్దేవా చేశారు. చరిత్రలో ఎన్నడూ లేని విదంగా జగన్ అండ్ కో చేసిన ఈపనికి యావత్ హిందూ లోకం కన్నెర్ర చేసిందని, ఆ దేవదేవునితో పెట్టుకున్న వారు కాలగర్భంలో కలిసిపోయారని గుర్తు చేశారు. ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో ప్రజలను ఎలా మోసం చేశారో అందుకు ప్రజలు కుడా అదే విదంగా బుద్ధి చెప్పారని, ఆ దేవుని విషయంలో కూడా అదే జరుగుతుందన్నారు. ఇదంతా కూడా డబ్బుకి ఆశ పడి చేశారా లేక హిందూ సాంప్రదాయాన్ని దెబ్బ తీయాలని చేశారా అనేది తెలియాల్సి ఉందని వెల్లడించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ జె వెంకటేష్

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తంబళ్లపల్లె

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలలో భాగంగా సోమవారం ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో సిహెచ్‌సి ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 మందికి స్థానిక డాక్టర్లు, ప్రత్యేక డాక్టర్లు, వైద్య పరీక్షలతో చికిత్సలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రజలకు ఆరోగ్య సూచనలలో సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సురేంద్రనాథ్, ఇఒపిఆర్‌డి దిలీప్ కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్‌గా జి.వి.పల్లవి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

తంబళ్లపల్లి నియోజకవర్గం, బి.కొత్త కోట నగర పంచాయతీ కమిషనరుగా జివి పల్లవి సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పల్లవి కదిరి మున్సిపల్ మేనేజర్‌గా విధులు నిర్వహిం చేవారు. బదిలీల ప్రక్రియలో భాగంగా ఆమె బి.కొత్తకోట కమిషనరుగా వచ్చారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ బి.కొత్తకోట నగర పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సిబ్బందితో కలిసి సంబంధంతో పనిచేసి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. పట్టణంలో పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించేందుకు తొలి ప్రాధాన్యతనిస్తామని స్పష్టం చేశారు.